క్లుప్తంగా

ఉదయభానుకు శుభాకాంక్షలు తెలిపిన ఆలయ ఈఓ



పెనుగంచిప్రోలు: తిరుమల తిరుపతి దేవస్థానం(టీటీడీ) డైరెక్టర్‌గా స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ సామినేని ఉదయభానును ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు శనివారం జగ్గయ్యపేటలోని ఆయన స్వగృహంలో స్థానిక శ్రీతిరుపతమ్మవారి ఆలయ ఈఓ కె.రమేష్‌నాయుడు ఆయన్ను సత్కరించి, శుభాకాంక్షలు తెలియజేశారు.

ఉదయభానుకు పలువురి అభినందనలు



జగ్గయ్యపేట అర్బన్: ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభానుకు తిరుమల తిరుపతి దేవస్థానం(టీటీడీ) పాలక మండలి సభ్యుడిగా అవకాశం కల్పించడం పట్ల ఎన్టీఆర్ జిల్లాతో పాటు నియోజకవర్గ వ్యాప్తంగా పలువురు అభిమానులు, శ్రేయోభిలాషులు అభినందనలు తెలియజేసి, హర్షం వ్యక్తం చేశారు. ఉదయభానుకు టీటీడీ పాలకవర్గ సభ్యుడిగా అవకాశం కల్పించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

దోమలు నివారణ కోసం ఎబేట్ పిచికారీ

చెవిటికల్లు(కంచికచర్ల): మండలంలోని చెవిటికల్లు గ్రామంలో సర్పంచి బుడ్డి విజయలక్ష్మి శనివారం దోమల నివారణ కోసం ఎబేట్‌ను పిచకారీ చేయించారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు మంగిసెట్టి పుల్లారావు, ఎంపీటీసీ మాజీ సభ్యుడు బుడ్డి సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి కనగాల రవికుమార్ పాల్గొన్నారు.

వత్సవాయికి తాగునీరు

వత్సవాయి: జల్‌జీవన్ మిషన్ ద్వారా వత్సవాయికి తాగునీరు అందనుంది. ఈ పథకంలో లింగాల మునేటి అవతల ఒడ్డునుండి ఆరు కిలోమీటర్ల మేర పైపులైన్‌ను ఏర్పాటుచేసి తాగునీటిని అందించనున్నారు. ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను కృషితో రూ. 3 కోట్ల 26 లక్షలతో ఈ పనులు ప్రారంభించనున్నట్లు సర్పంచ్ భూక్యా సీతమ్మ తెలిపారు. ఈ పనుల్లో భాగంగా శనివారం వత్సవాయికి పైపులు చేరుకున్నాయి. వెంటనే పనులను ప్రారంభిస్తామని వత్సవాయి పంచాయతీ ఈఓ షేక్ ఇమామ్‌సాహెబ్ తెలిపారు.

డిగ్రీ, జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలి

జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేట మండలంలో ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో శనివారం ఆ ఫెడరేషన్ జిల్లా నాయకుడు గోపి నాయక్ మాట్లాడుతూ జగ్గయ్యపేట మండలంలో జూనియర్, డిగ్రీ కళాశాల, పాలిటెక్నిక్ కళాశాలలు ఏర్పాటుచేయాలని కోరారు. ఎస్ఎఫ్ఐ పేట మండల కార్యదర్శి భరత్, అధ్యక్షుడు అజయ్, మండల కమిటీ సభ్యులు కమల్, శివ, తరుణ్ పాల్గొన్నారు.

29 నుంచి సంగీత మహోత్సవాలు

విజయవాడ కల్చరల్: లయనాద కళా స్రవంతి సంగీత సంస్థ ఆధ్వర్యంలో సంగీత విద్వాంసుడు లంకా వేంకటేశ్వర్లు సంగీత మహోత్సవాలను నిర్వహిస్తున్నట్లు సంస్థ ప్రధాన కార్యదర్శి మాధవి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. 29వ తేదీ నుంచి ఐదు రోజులపాటు దుర్గాపురం రామానగర్‌లోని శివరామకృష్ణ క్షేత్రంలో మహోత్సవాలు కొనసాగుతాయన్నారు.

ఉరి వేసుకుని యువకుడి ఆత్మహత్య

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): ఆర్థిక ఇబ్బందులతో యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటనపై ఎస్ఎన్‌పురం పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. వారు తెలిపిన వివరాల ప్రకారం కటారి వెంకట సాయి (27) బీఆర్టీఎస్ రోడ్డులోని ఒక ఆటో ఫైనాన్స్ కంపెనీలో పనిచేస్తూ శ్రీనగర్ కాలనీ, 2వ లైన్‌లో తల్లిదండ్రులతో కలసి నివాసముంటున్నాడు. మద్యానికి, చెడు వ్యసనాలకు బానిస అయ్యాడు. ఇటీవల అప్పులతో ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నట్లు తల్లిదండ్రుల వద్ద బాధపడుతుండేవాడు. ఈ క్రమంలోనే శుక్రవారం రాత్రి 9.30 గంటలకు భోజనం చేసి మేడ పైన గదిలో పడుకోడానికి వెళ్లాడు. శనివారం ఉదయం తల్లి రూం శుభ్రపరిచేందుకు కొడుకు గదిలోకి వెళ్లగా చున్నితో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని వేలాడుతూ కనిపించాడు. వెంటనే కుటుంబ సభ్యులు, స్థానికులకు విషయం తెలపడంతో వారు కిందికి దింపి చూడగా అప్పటికే మృతిచెంది ఉన్నాడు. దీనిపై సమాచారం అందుకున్న ఎస్ఎన్‌పురం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. దీనిపై అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

జగనన్న కాలనీల్లో విద్యుత్ వెలుగులు



శివాపురం కాలనీలో విద్యుత్ సౌకర్యం



నవాబుపేటలోని జగనన్న కాలనీలో విద్యుత్ సౌకర్యం

- 27 లేఅవుట్లలో విద్యుత్ సౌకర్యం
- మండలంలో రూ.80 లక్షల ఖర్చు

పెనుగంచిప్రోలు: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న కాలనీల్లో విద్యుత్ వెలుగులు ఏర్పాటుతో కళకళలాడుతున్నాయి. కేవలం ఇళ్ల నిర్మాణంతో సరిపెట్టకుండా అందులో ప్రజలు సౌకర్యవంతంగా నివసించేలా విద్యుత్ విద్యుత్ సౌకర్యం ఏర్పాటు చేశారు. మండలంలో మొత్తం 27 లేఅవుట్లలో 50 విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లతో పాటు 230 వరకు స్తంభాలు ఏర్పాటు చేశారు.

రూ.80 లక్షల వరకు ఖర్చు

ప్రభుత్వం మండలంలో ఏర్పాటు చేసిన జగనన్న కాలనీల్లో రూ.80 లక్షల వరకు ఖర్చు పెట్టి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుతో పాటు విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసింది. ఇల్లులేని పేద కుటుంబం ఉండకూడదనే లక్ష్యంతో ప్రభుత్వం మండలంలో 1,500 మందికి ఇళ్ల పట్టాలు పంపిణీ చేసింది. పట్టాలు పంపిణీ చేసి చేతులు దులుపు కోకుండా జగనన్న కాలనీలో మౌలిక సదుపాయాలకు పెద్దపీట వేసింది. ప్రతి నెలా జగనన్న కాలనీలో సౌకర్యాలపై సమీక్షలు నిర్వహిస్తూ తనిఖీలు నిర్వహిస్తున్నారు.

కాలనీల్లో సకల సౌకర్యాలు



జగనన్న ప్రభుత్వంలో ఇంటిస్థలం, ఇంటి నిర్మాణంతో పాటు కాలనీలో సకల సౌకర్యాలు అందిస్తున్నారు. కాలనీలో అంతర్గ రోడ్లు, నీటి సౌకర్యంతో పాటు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేశారు. స్థానిక ఎమ్మెల్యే చొరవతో కాలనీల్లో అధికారులు కాలనీలో సౌకర్యాలు త్వరితగతిన పూర్తి చేస్తున్నారు. – తిరుపతమ్మ, లబ్ధిదారు, నవాబుపేట

రాయితీపై నిర్మాణ సామగ్రి



ప్రభుత్వం కేవలం ఇళ్ల నిర్మాణాలు చేపట్టటమే కాకుండా జగనన్న కాలనీల్లో సకల సదుపాయాలు కల్పిస్తోంది. కాలనీల్లో విద్యుత్, నీటి కోసం మోటార్లు ఏర్పాటు చేసింది. ఒక్కో ఇంటికి రూ.1.80 లక్షల ప్రభుత్వ రుణంతో పాటు డ్వాక్రా మహిళలకు అదనంగా రూ.35 వేలు అందిస్తోంది. నియోజకవర్గంలో ఎమ్మెల్యే, ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను ఇళ్ల నిర్మాణంలో ప్రత్యేక దృష్టి పెడుతున్నారు. లబ్ధిదారులకు రాయితీపై నిర్మాణ సామగ్రి అందిస్తున్నారు. – మార్కపూడి గాంధీ, ఎంపీపీ, పెనుగంచిప్రోలు

మానవసేవ, త్యాగానికి ప్రతిరూపం థెరిస్సా

జగ్గయ్యపేట అర్బన్: రోగుల పట్ల జాలి చూపుతూ వారికి నిస్వార్థ సేవలను అందించిన మదర్ థెరిస్సా చిరస్మరణీయురాలని, నేటి తరం విద్యార్థులు ఆమె త్యాగనిరతిని, సేవాభావాన్ని ఆదర్శంగా తీసుకోవాలని మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర సూచించారు. థెరిస్సా జయంతి వేడుకలు శనివారం వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక సెయింట్ ఆన్స్ ఆస్పత్రిలోని థెరిస్సా విగ్రహానికి చైర్మన్ రాఘవేంద్ర, పార్టీ పట్టణ అధ్యక్షుడు ఆకుల శ్రీకాంత్ మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్ తదితర నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ చేనేత విభాగం జిల్లా అధ్యక్షుడు పెంటి శ్రీనివాసరావు మాట్లాడుతూ 20 వ శతాబ్దపు మహోన్నతమైన వ్యక్తి మదర్ థెరిస్సా అన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, కౌన్సిలర్లు వట్టెం మనోహర్, పందుల రోశయ్య, పార్టీ జిల్లా కార్యదర్శి చెరుకుమల్లి రాంబాబు, పెనుగంచిప్రోలు మండల సచివాలయాల కన్వీనర్ శామ్యూల్, నాయకులు నాగేంద్ర, కిషోర్, చిరంజీవి, సాంబ పాల్గొన్నారు.

బీసీ సంఘాల ఆధ్వర్యంలో..

మదర్ థెరిస్సా జయంతి వేడుకలు స్థానిక బీసీ సంఘాలు, బీసీవై పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. బీసీ సంఘం నేత తూమాటి కృష్ణ థెరిస్సా మాట్లాడారు. నేత జవ్వాజి నరసింహారావు ఆధ్వర్యంలో సెయింట్ ఆన్స్ హాస్పిటల్‌లో రోగులకు పాలు, పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు.



థెరిస్సా విగ్రహానికి నివాళులర్పిస్తున్న మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర, నాయకులు

ఉచితంగా వైద్య పరీక్షలు

మదర్ థెరిస్సా జయంతిని పురస్కరించుకుని స్థానిక వాగ్దేవి మహిళా కళాశాల ఆధ్వర్యంలో జయంతి వేడుకలు నిర్వహించారు. సెయింట్ ఆన్స్ హాస్పిటల్‌లో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ రోజు హాస్పిటల్‌కు వచ్చిన రోగులకు ఉచితంగా బీపీ పరీక్షలు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ బి.సురేష్, కరస్పాండెంట్ సరిత పాల్గొన్నారు.

కంచికచర్లలో..

కంచికచర్ల: స్థానిక శాఖా గ్రంథాలయంలో మదర్‌థెరిస్సా జయంతి వేడుకలు శనివారం జరిగాయని గ్రంథపాలకుడు అల్లూరు రామచంద్రుడు తెలిపారు. ముందుగా మదర్‌థెరిస్సా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ పేదలకు ఉచితంగా ఆస్పత్రులు కట్టించి ఉచితంగా వైద్య సేవలు అందేలా చేశారన్నారు. తెలుగు ఉపాధ్యాయుడు షేక్ ఇస్మాయేలు, బిడిసి సెంటర్ నిర్వాహకులు పేరయ్య పాల్గొన్నారు.



కంచికచర్లలో మదర్‌థెరిస్సా చిత్రపటానికి నివాళులర్పిస్తున్న రామచంద్రుడు, ఇస్మాయిల్

జిల్లా పరిషత్ స్కూల్‌లో ..

గిడుగు రామ్మూర్తి జన్మదినం సందర్భంగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు భాషా వారోత్సవాలు శనివారం జరిగాయని హెచ్ఎం సుబ్బారెడ్డి తెలిపారు. విద్యార్థులకు ముందుగా పలు విభాగాల్లో పోటీలు నిర్వహించారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఇస్మాయేల్, శివజ్యోతి, ఏవీడీ కుమారి, కుమారి, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అండగా ప్రభుత్వం



రైతులకు వరి విత్తనాలను అందజేస్తున్న రవిశంకర్

నందిగామ: మన రాష్ట్రంలో రైతులకు అండగా ప్రభుత్వం ఉందని కేడీసీసీ బ్యాంకు డైరెక్టర్ రవి శంకర్ అన్నారు. మండలంలోని మాగల్లు గ్రామంలో రైతు భరోసా కేంద్రం ద్వారా పలువురు రైతులకు 80 శాతం రాయితీపై వరి విత్తనాలను శనివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రైతుల పక్షపాతి అన్నారు. ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా రైతులకు అండగా నిలవడంలో మన రాష్ట్రం ముందంజలో ఉందన్నారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయాధికారి మహేష్ పాల్గొన్నారు.

అమ్మవారిని దర్శించుకున్న చీఫ్ సెక్యూరిటీ వింగ్ ఎస్పీ



పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసి ఉన్న తిరుపతమ్మ వారిని శనివారం చీఫ్ సెక్యూరిటీ వింగ్ ఎస్పీ ఉదయరాణి దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించారు. ఈ సందర్భంగా వేద పండితుల ఆశీర్వచనం అనంతరం ఆలయ అధికారులు ఆమెను అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలతో సత్కరించారు.

తాగునీటి సమస్య పరిష్కారం

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని 29 వ వార్డు అయ్యప్ప గుడి పరిసర ప్రాంతంలో పైపులైన్ మరమ్మతులకు గురికావడంతో స్థానిక ప్రజలు తాగునీటి సమస్యతో ఇబ్బందులు పడ్డారు. సమస్యను మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్రకు స్థానికులు విన్నవించడంతో స్పందించిన చైర్మన్ రాఘవేంద్ర యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టారు. ఇంజనీరింగ్ సిబ్బందిని పిలిపించి పైపులైన్‌కు నూతన వాల్వ్ ఏర్పాటుచేయించి మరమ్మతులు చేయించారు. మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు ఆకుల శ్రీకాంత్, కౌన్సిలర్ కంచేటి గీతారాణి, నాయకులు తన్నీరు నాగేంద్ర, శ్రీనివాస్ పాల్గొన్నారు.



పైపులైన్ మరమ్మతులను పర్యవేక్షిస్తున్న మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర తదితరులు

కారుతో ఢీకొట్టడంతో వ్యక్తికి తీవ్రగాయాలు

కంచికచర్ల: ఓ వివాహితను కారులో ఎక్కించుకుని వెళుతుండగా ఆమె భర్త బైక్ అడ్డంపెట్టడంతో కారుతో ఢీకొట్టడంతో ఆయనకు తీవ్ర గాయాలైన సంఘటన శనివారం జరిగింది. ఎస్సై పీవీఎస్ సుబ్రహ్మణ్యం కథనం మేరకు నందిగామకు చెందిన ఓ యూట్యూబ్ చానెల్ రిపోర్టర్ వీరబాబు ఓ వివాహితురాలిని నందిగామ నుంచి కారులో ఎక్కించుకుని విజయవాడ వైపునకు వెళుతుండగా మండలంలోని కీసర టోల్‌ప్లాజా సమీపంలోకి రాగానే ఆమె భర్త తన భార్యను ఎందుకు కారులో ఎక్కించుకుని వెళ్లుతున్నావని ప్రశ్నిస్తూ కారుకు తన బైక్‌ను అడ్డుపెట్టాడు. ఆ యూ ట్యూబ్ చానెల్ రిపోర్టర్ కారుతో బైక్‌ను ఢీ కొట్టి పరారయ్యాడు. దీంతో ఆమె భర్తకు తీవ్రగాయాలయ్యాయి. పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పేదల సొంతింటి కల సాకారం

జగ్గయ్యపేట అర్బన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు ఇంటి స్థలం ఇవ్వడంతో పాటు ఇంటి నిర్మాణానికి అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందించడంతో పేదల సొంతింటి కల సాకారం అవుతుందని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ యువజన నాయకుడు సామినేని వెంకటకృష్ణ ప్రసాద్ అన్నారు. స్థానిక బలుసుపాడు రోడ్‌లో ఉన్న జగనన్న కాలనీలో శనివారం మిట్టగూడెం బజారుకు చెందిన మళ్ల శ్రీనివాస్ నూతన గృహాన్ని వెంకటకృష్ణప్రసాద్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం ప్రవేశపెట్టిన నవరత్నాలు–పేదలందరికీ ఇళ్ల పథకం పేద కుటుంబాలకు వరంగా మారిందని తెలిపారు.



జగనన్న కాలనీలో గృహప్రవేశ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేత వెంకటకృష్ణ ప్రసాద్

నైపుణ్యాలను పెంపొందించుకోవాలి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విద్యార్థులు తమ నైపుణ్యాలను పెంపొందించుకున్నప్పుడే చక్కని భవిష్యత్‌ను సొంతం చేసుకుంటారని ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుడు శ్రీపతి జగదీష్ అన్నారు. పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ ఎన్ఎస్ఎస్ యూనిట్స్ ఆధ్వర్యంలో జిల్లా యువజన సర్వీసుల శాఖ సహకారంతో కెరీర్ గైడెన్స్, వ్యక్తిత్వ వికాసంపై సదస్సును శనివారం ఆ కళాశాల ప్రాంగణంలో నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీపతి జగదీష్ మాట్లాడుతూ విద్యార్థులు తమతమ రంగాలకు సంబంధించిన అంశాలపై పట్టు సాధించాలన్నారు. జిల్లా యువజన సర్వీసుల శాఖ సహాయ మేనేజర్ నిమ్మగడ్డ నాగేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులు స్వీయ అవగాహనతో నిర్ణయం తీసుకునే దిశగా తమ నైపుణ్యాలకు పదును పెట్టాలన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ జె. లక్ష్మీనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ పతంజలిశాస్త్రి ఎన్ఎస్ఎస్ పీవో పీటీవీ శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని ఎస్‌బీఐ కొత్తపేట శాఖ మేనేజర్ సంతోష్‌కుమార్ అన్నారు. కొత్తపేట హిందూ హైస్కూల్‌లో తెలుగు భాషా దినోత్సవ వారోత్సవాలను పాఠశాలలోని శ్రీనాథాంధ్ర భాషా సమితి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా తెలుగు ఖ్యాతిని నలుదిశల వ్యాపింపజేసిన ప్రముఖులు, కవుల వేషధారణలతో విద్యార్థులు అలరించారు. అదేవిధంగా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కొత్తపేట బ్రాంచ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు 50 మొక్కలను పంపిణీ చేసి వాటి పరిరక్షణ బాధ్యతలు చేపట్టాలని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాసరావు చెప్పారు. తెలుగు ఉపాధ్యాయులు కె. శ్రీనివాస్, డాక్టర్ ఎస్. వెంకటేశ్వరరావు, డాక్టర్ కె కృష్ణ కార్యక్రమాలను పర్యవేక్షించారు.

పరిశ్రమలను ప్రోత్సహించాలి



మాట్లాడుతున్న డీఆర్వో

వేదాద్రి(జగ్గయ్యపేట): పరిశ్రమల రంగానికి ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యం ఇస్తోందని ప్రజలు కూడా గ్రామాలలో పరిశ్రమల ఏర్పాటును ప్రోత్సహించాలని జిల్లా రెవెన్యూ డివిజనల్ అధికారి మోహన్‌కుమార్ పేర్కొన్నారు. గ్రామంలో ఏర్పాటు చేయనున్న కామ్య ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్‌పై శనివారం కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్లాంట్‌లో ఆస్బెస్టాష్, నాన్ ఆస్బెస్టాష్ ఫ్లాట్ సిమెంట్ షీట్లు తయారు చేయనున్నట్లు పేర్కొన్నారు. రూ. 30 కోట్ల వ్యయంతో కంపెనీని స్థాపిస్తున్నారని తెలిపారు. రావిరాల, జయంతిపురం, పోచంపల్లి, మాదిపాడు, గుండబోయినపాలెం ప్రాంతాల్లోని నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పించనున్నట్లు తెలిపారు. కాలుష్య నియంత్రణ మండలి నిబంధనల మేరకు కంపెనీని నిర్వహించాలని చెప్పారు. కాలుష్య నియంత్రణ మండలి ఈఈ శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రజాభిప్రాయ సేకరణలో ప్రజల నుంచి, పర్యావరణ వలంటీర్ల సూచనలను కేంద్ర కాలుష్య నియంత్రణ మండలికి పంపనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్లాంట్ టెక్నికల్ కన్సల్టెంట్ భాస్కరరావు, తహసీల్దార్ చిన్నారావు, డీటీ నాగరాజు, సర్పంచ్ గుడారు పేరయ్య, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల కన్వీనర్ మండవ శ్రీనివాసగౌడ్, నాయకులు స్వామి, వైకుంఠరావు, రాము పాల్గొన్నారు.

ముమ్మరంగా పెసర, మినుము కోతలు



మినుము పంట కోస్తున్న యంత్రం

వీరులపాడు: వాతావరణ శాఖాధికారుల ప్రకటనలు.. మేఘావృతమైన ఆకాశం.. కురుస్తున్న చిరుజల్లులు.. మినుము, పెసర రైతుల గుండెల్లో రైళ్లు పరుగెట్టిస్తున్నాయి.. పంట సాగు చేసిన నాటి నుంచి తెగుళ్ల పంటను కాపాడుకుంటూ వస్తున్న రైతులకు పంట చేతికొచ్చే సమయంలో కురుస్తున్న అకాల వర్షాలు కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయి. దీంతో యంత్రాల సహకారంతో పంటను కోసి ఇంటికి చేర్చేందుకు రైతులు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. మండలంలో 634 హెక్టార్లలో రైతులు పెసర సాగు చేపట్టగా 59 హెక్టార్లలో మినుము పంట సాగు చేశారు. రెండు రోజులుగా వాతావరణ శాఖాధికారులు తుపాను హెచ్చరికలు చేస్తుండటంతో పంటలను కాపాడుకునేందుకు రైతులు అవస్థలు పడుతున్నారు. వర్షాల కారణంగా కోత యంత్రాల నిర్వాహకులు ఎకరాకు రూ.1700 వరకు తీసుకుంటున్నారని పలువురు రైతులు పేర్కొన్నారు. ఈ ఏడాది వాతావరణం అనుకూలంగా ఉండటంతో పాటు పంట దిగుబడులు కూడా ఆశాజనకంగా ఉన్నాయని రెండు, మూడు రోజుల్లో దాదాపుగా పంట కోతలు ముగుస్తాయని రైతులు అంటున్నారు.

జగనన్న పాలవెల్లువపై అవగాహన



మాట్లాడున్న పశువైద్యాధికారి అనిల్

నవాబుపేట(పెనుగంచిప్రోలు): స్థానిక పంచాయతీ కార్యాలయంలో శనివారం జగనన్న పాలవెల్లువ కార్యక్రమంపై డ్వాక్రా మహిళలు, వైఎస్సార్ చేయూత లబ్ధిదారులు, పాడిరైతులకు అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పశువైద్యాధికారి అనిల్ మాట్లాడుతూ కార్యక్రమంలో భాగంగా మొదట మండలంలోని ముండ్లపాడు, శనగపాడు, కొణకంచి. నవాబుపేట, వెంకటాపురం, వెంగనాయకునిపాలెం గ్రామాల్లో అమూల్ ద్వారా పాల సేకరణ జరుగుతుందన్నారు. రైతులకు అమూల్ ద్వారా పాలకు గరిష్ఠ ధర లభిస్తుందన్నారు. కార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు కాకాని పద్మ, ఏపీఎం రాజారావు, వైఎస్సార్ సీపీ నాయకుడు మధు పాల్గొన్నారు.

చిల్లకల్లులో..

చిల్లకల్లు(జగ్గయ్యపేట): పాడి రైతులకు మేలు చేసే విధంగా ప్రభుత్వం జగనన్న పాలవెల్లువ ద్వారా కృషి చేస్తోందని పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకుడు భవానీ ప్రసాద్ పేర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నేషనల్ లెవల్ మిషన్, అమూల్ ఏపీ సంయుక్తాధ్వర్యంలో సచివాలయ సిబ్బంది, సెర్ప్ యానిమేటర్స్, వలంటీర్లకు శనివారం అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న పాల వెల్లువ అమూల్ సంస్థతో ప్రభుత్వం ఒప్పందం ప్రకారం పాడి రైతులు, పశుపోషకులకు మేలు చేసే విధంగా చర్యలు తీసుకుంటుందని తెలిపారు. రానున్న రోజుల్లో పాడి రైతులకు గిట్టుధర కల్పించటం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పశువైద్యాధికారులు లక్ష్మీప్రసన్న, శ్రీను నాయక్ పాల్గొన్నారు.

మున్సిపల్ ఉద్యోగిపై కాంట్రాక్టర్ దౌర్జన్యం?

జగ్గయ్యపేట: పట్టణంలోని మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగంలోని ఉన్నత ఉద్యోగిపై మున్సిపల్ కాంట్రాక్టర్ దౌర్జన్యం చేసి, రికార్డులను తీసుకెళ్లిన ఘటన పట్టణంలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. ఇంజినీరింగ్ విభాగంలోని ఉన్నత ఉద్యోగి రాత్రి తొమ్మిది గంటల సమయంలో తన ఛాంబర్‌లో విధులు నిర్వహించుకుంటుండగా కాంట్రాక్టర్ ఆ సమయంలో మద్యం మత్తులో వచ్చి తాను చేసిన పనులకు బిల్లులు ఎందుకు ఇవ్వడం లేదంటూ దౌర్జన్యం చేసి, మున్సిపాలిటీకి సంబంధించిన ఎస్టిమేట్ రికార్డులు, ఎంబుక్‌లను ఎత్తుకెళ్లాడు.

శనివారం ఉదయం తొమ్మిది గంటల సమయంలో సదరు కాంట్రాక్టర్ కార్యాలయం ఎదుట ఉన్న బల్లపై రికార్డులు పెట్టి వెళ్లాడు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఉద్యోగి తెలిపారు. ఈ విషయంపై కమిషనర్‌ను వివరణ కోరగా సెలవులో ఉన్నారని తెలిపారు. మున్సిపల్ చైర్మన్‌ను వివరణ కోరగా ఈ విషయం తన దృష్టికి వచ్చిందని పేర్కొన్నారు.

గ్రామంలో ఫీవర్ సర్వే



గ్రామంలో సర్వే చేస్తున్న వైద్యాధికారులు

అన్నవరం(జగ్గయ్యపేట): గ్రామంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా శనివారం వైద్యారోగ్యాధికారులు, సిబ్బంది ఫీవర్ సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా భూచవరం ప్రభుత్వ వైద్యాధికారి అనిల్‌కుమార్ మాట్లాడుతూ వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ముఖ్యంగా గ్రామంలో పంచాయతీ అధికారులు డ్రెయిన్‌లలో మురుగు నీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. ఖాళీ, నీటి నిల్వ ప్రాంతాలలో దోమలు వ్యాప్తి చెందకుండా రసాయనాలు పిచికారీ చేయాలన్నారు. మలేరియా, డెంగీ వంటి జ్వరాలు లేవన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ వెంకట్రావ్, రమేష్, ఏఎన్ఎం వనజ, వరలక్ష్మి పాల్గొన్నారు.